

# గీటురాయి

రచన : బండారు నారాయణరావు

ప్రకాశం సందు మలుపు తిరుగుతూ ఉండగా వెనకనుంచి 'అబ్బాయిగారూ' అంటూ ఓ స్త్రీకంఠం పిలవటం వినిపించింది. అతను వెనక్కి తిరిగి చూశాడు. తాటాకు పాక చూరు కింద ముగ్గురు ఆడాళ్లు కూర్చుని వున్నారు. కొంచెం పరికించి చూస్తే వాళ్లు బజారు మనుషుల్లా కనిపించారు!

ప్రకాశం యింకా అలానే ఆలోచిస్తూ నిలుచోటం చూసి, అందులో ఒక మనిషి చెయ్యెత్తి 'అబ్బాయిగారూ' అని మళ్ళీ పిలిచింది. అతనికి కొంచెం అనుమానం కలిగింది. ఆ ప్రాంతంలో ఎక్కువగా మనుషులు లేకపోయినా, చుట్టూ కలయజూస్తూ సిగ్గును చంపుకుని తాటాకు పాక దగ్గరకు వచ్చాడు. ఆ ముగ్గురిలో ఒక మనిషి ఎర్రగానూ ఇద్దరు నల్లగానూ కనిపించారు. ఒకామె లేచి 'కొత్త మనిషండీ! మంచి అందంగా ఉంటుంది' అన్నది. ప్రకాశానికి విషయం పూర్తిగా అర్థమయింది.

'రాండి చూపిస్తాను' అంటూ ఇంట్లోకి దారి తీసింది. కొన్ని నిమిషాలు గడచినప్పటికీ అతని నోటివెంట ఒక్క మాటయినా రాకపోవడం చూసి, మిగతా ఇద్దరు ముఖాలు చాటుగా తిప్పుకుని నవ్వుకున్నారు. చప్పుడు లేకుండా ప్రకాశం, ఆమె వెంట లోపలికి వెళ్లాడు. ఆ మనిషి తలుపు దగ్గరగా వేసి మరో గదిలోకి వెళ్లింది.

కూర్చోవాలో నుంచోవాలో అర్థంగాక, కాస్సేపాలోచించి తెల్లని దుప్పటి పరచివున్న మంచం మీద కూర్చున్నాడు ప్రకాశం. కాస్సేపట్లో పక్క గదిలోనించి ఒక మనిషి లోపలికొచ్చి ఒక మూల నుంచున్నది. తొందరపాటు చూపకుండా అలానే కూర్చున్నాడు ప్రకాశం. గదిలో చీకటి మూలాన్ని ఆమె ముఖం

సరిగా కనిపించటం లేదు. ఆమె కొంచెం దగ్గరగా వచ్చి చేర వేసిన తలుపు పక్కకు తొలగించింది. అంతవరకూ ఏవిధమైన చలనమూ లేని ప్రకాశం ఆమె ముఖం లోకి పరీక్షగా చూసి ఒక్కసారి తెల్ల బోయాడు. వెంటనే ఆ మనిషి ముఖం కూడా పాలిపోయింది. ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుంటూ అలాగే వుండి పోయారు.

*  *

సావిత్రి కోటమ్మగారి కోడలు. ఎప్పుడైతే కోడలు తన ఇంట్లో అడుగు పెట్టిందో, బజారులో వస్తువును కొనుక్కున్నట్లు సావిత్రిని సొంతం చేసుకున్నది కోటమ్మ. ఈ కారణంతోనే ఆమె తన కోడల్ని అమ్మగారి ఇంటికి వెళ్ల నివ్వదు; సరిగదా—పొరిగింటికి కూడా పోనివ్వదు. తన కోడలితో ఏ పొరిగింటి అమ్మాయి ఐనా కాస్సేపు మాట్లాడేందు కొస్తే, గట్టిగా పెడబొబ్బ పెట్టి పిలుస్తుంది కోడల్ని. ఇంతకూ కోటమ్మకు అనుమానమేమంటే, తన కోడలికి ఇరుగు పొరుగు వాళ్లంతా ఏవేవో నూరిపోస్తున్నారని, తత్ఫలితంగా దాని బుర్ర తిరిగి తనను నిర్లక్ష్యం చేస్తుందని, అది మితి మీరితే తనమీద తిరుగుబాటు చేస్తుందనీ ఆమె కొక భయం!

సావిత్రి తల్లిదండ్రులు మొహం వాచిన బాపతు. తమ కూతుర్ని వొదిలించుకోవటానికి వాళ్లు పెద్ద ప్రయత్న మేమీ చెయ్యకుండానే తగిన సంబంధం దొరికింది. యేదో విధంగా ఆమె మెళ్ళో మూడు ముళ్లూ పడేసి దేవుడికి దణ్ణం పెట్టారు.

ఈ కారణాన్ని ఆధారంగా తీసుకుని కోటమ్మ తన కోడల్ని అప్పుడప్పుడూ ఏదో ఒక రూపేణా ఎత్తి పొడవటం ప్రారంభించేది.

'లోకంలో ఇన్ని సంబంధాలు ఉండగా మాకర్మకొద్దీ ఈసౌభాగ్యం దొరికింది! లేకపోతే ఏమిటి? నిక్షేపంగా పదేసి వందలు కట్నా లిచ్చేవాళ్లను వొదులుకొని గతిమాలినదాన్ని చేసుకోవటం? రామరామా మాకిదెక్కడి పీడాకారం!'

ఇటువంటి మాటల్ని సావిత్రి అసలు లక్ష్యపెట్టేది కాదు. తన భర్త ప్రయోజకుడై ఉండి కూడా, తల్లి ఏమి చెయ్యమంటే అదల్లా చేస్తూ ఉండడం, ఆమెకు చాలా అసహ్యంగా ఉండేది. తల్లి ఏవిధంగా ఆడిస్తే అలా ఆడే కీలుబొమ్మ! రోజుకు నాలుగైదు రూపాయలు సంపాదిస్తాడు ఏం ప్రయోజనం? సంపాదించి తెచ్చిన డబ్బులు తల్లి చేతులో పోస్తాడు. అవి తీసుకుని ఆయమ్మగారు, రోజుకు మూడణాలు సాదరు కని ఇస్తుంది. అంతే! మళ్లీ దమ్మిడీ అడగ రాదు. అడిగితే బయటికి పొమ్మంటుందని భయం! లోకంలో స్వతంత్రంగా బతికే అవకాశా లున్నై కాని, ఆయనగారికి ఆ పద్ధతిగా జీవించే శక్తి లేదు. అవకాశం లేకపోతే సావిత్రికి తన భర్తమీద రోత పుట్టక పోదు. ఇన్ని ప్రయోజకత్వాలు ఉండి కూడా తాము ఇరువురూ నిర్బంధంలో ఉండవలసిన గ్రహచార మేమిటూ, అని ఆమె బాధ పడేది.

ఒక అణా బేడా కావలసి వస్తే అత్తగార్ని అడగాలి కాని, మొగుణ్ణి అడగ కూడదని కూడా ఆమె శాసనం! అడిగితే

అతని దగ్గర డబ్బు ఉండవు. పోనీ సంపాదించేదాంట్లో ఒక రూపాయో, అర్థో మిగిల్చి భార్యకు అందించే సాహసమూ లేదు. ఎందుకుంటుంది? తల్లిగారి మెప్పు కోల్పోడూ!

ఆ కొంపలో ఇంత రగడ జరుగుతున్నా, సావిత్రి మటుకు ఎప్పుడూ అత్తగారిమీదగాని ఆ ఇంట్లో ఇతర్లమీదగాని నోరు చేసుకో లేదు. ఆమెకు నోరు లేక పోలేదు. అవసరం వస్తే గాని దాన్నామె ఉపయోగించదు.

సావిత్రికి చదువు వుందిగాని సంస్కారము లేదంటారు. ఏమో? ఆవిషయం చెప్పటం కష్టం! సంస్కారం ఉన్నవాళ్లు ఆమెకంటే మహా పొడి చేసిందీ లేదు.

బాగా ఆలోచించేప్పటికి ఇటువంటి కారణాలే సావిత్రికి తన భర్త మీద విముఖత కలిగించి ఈ గుడిసెలోకి నెట్టి ఉండాలి అనిపించింది ప్రకాశానికి. తను కాబట్టి సరిపోయింది, కాని మరొకడైతే ఈపాటికి ఆమెమీద చెయ్యి వేశే వాడే! అతను కొంచెం దగ్గరగా జరిగి 'ఇదేమిటి సావిత్రీ! ఇక్కడున్నావ్?' అన్నాడు గొంతు తగ్గించి.

సావిత్రి కొంచెం సిగ్గు పడుతూ 'నా కాపరం నీకు తెలియని దేముందీ? నా మొగుడు శుద్ధ చవట...' అని ఆగి మళ్లీ అందుకుంది. 'ఎప్పుడైనా, నా పుట్టింటికి చూడటానికైనా వెళ్లనివ్వరు మా అత్తగారు. పంపించమని మా ఆయనా చెప్పడు. అతనొక బుద్ధిమంతుడు! నా నా తరుపున మాట్లాడితే, తను పెళ్లాం చంకలో దూరాడని తల్లి ఎగిరి పడుతుందని అతని భయం! అలాంటి మగాడు పెళ్లాన్ని ఎలా భరిస్తాడు? పెళ్లాలు మాత్రం అటువంటి మొగుళ్లతో ఏం కాపరం వెలగ బెడతారు?'

'అసలు సంగతి అదన్న మాట?' అన్నాడు ప్రకాశం.

'అదొక్కటే కాదు. ఒకసారి మా అమ్మగారింటికి వెళ్ళివస్తానంటే, వొంటి మీద నగలు, ఇక్కడ పెట్టి మరీ వెళ్లమన్నారు. నేనూ, మా అమ్మగారు అంత దొంగలమూ, నమ్మకము లేని వాళ్లమూ ఐతే, ఆ కొంపలో నేనెలా వేగనూ? ఇది న్యాయమా? అన్యాయమా? అని నేనేమీ వాళ్ల నడగ లేదు. ఎవరితోనూ చెప్పలేదు కూడానూ! ఎందుకు? చెబితే ప్రయోజన మేమైనా ఉంది గనకనా? అసలే నాకాపరం తుమ్మితే ఊడిపోయే ముక్కులా వుంది. ప్రాకులాడినా ఫలితం దక్కదు.'

దీర్ఘంగా శ్వాస విడిచి ప్రకాశం 'సావిత్రీ! మంచీ, చెడ్డల గురించి నీకు చెప్పగలతాహతు నాకు లేదనుకుంటాను' అన్నాడు. సావిత్రి, 'అదేమిటి మంచీ, చెడ్డలకు తాహతు లెందుకు? చెప్పటం మీ కెంత ఇష్టమో వినడం నా కంత ఇష్టం' అన్నది.

'పరిష్కారమార్గాలు ఎవరి కేవిధంగా ఉంటాయో నేనూహించలేను. నా వుద్దేశ్య మేమంటే, గుట్టు బయట పడకుండా మెలగడం ఆడదానికి ముఖ్యం' అన్నాడు ప్రకాశం.

అడగవలసిన వివరాలు ఎన్నో ఉండగా సూటిగా ఒక్క ముక్కలోనే ముగించడం, సావిత్రికి తడిగుడ్డతో గొంతు కోసినట్లయింది.

ప్రకాశానికి అకస్మాత్తుగా ఒక ఆలోచన తట్టింది. తనకా, ఇంకా పెళ్ళి పెడాకులూ కాలేదు. అవకాశం లేకపోలేదు; ప్రేమించడం వేరు, పెళ్లి చేసుకోవడం వేరు. ఈపళంగా సావిత్రిని ఎక్కడికైనా పట్టుకుపోయి కాలం గడిపితే? తనకు ఆడదాని సమస్యా తీరుతుంది; ఈమెను నరకంలో నించి బయటకు లాగినట్టూ ఉంటుంది. సావిత్రిని వెదకటానికి ఎవరుమటుకు ప్రయత్నిస్తారు? తుమ్మితే ఊడిపోయే ముక్కు, అది ఉన్నా ఒకటే ఊడినా ఒకటే! తనను ఎవరైనా విమర్శిస్తారనే సమస్యకూడా లేదు.

సావిత్రికి తన అభిప్రాయం కాస్త వెలిబుచ్చాడు ప్రకాశం. ఆమె చాలా సేపు ఆలోచించింది కాని, అభ్యంతరం చెప్పలేదు.

## 2

గోదావరి స్టేషనులో బండి ఆగేటప్పటికి రాత్రి చాలా చిక్కబడింది. స్టేషను నుంచి ఊళ్లోకి ఇద్దరూ నడిచి వెళ్ళారు. రెండు రోజుల్లోనే ఇద్దరికి సరిపోయే చిన్న గది దొరికింది. మొదట్లో ఆహార సమస్య తల ఎత్తింది కాని, సావిత్రి మెడలో మూడు కాసుల బంగారం మెరుస్తున్నది. దాన్ని తీయటానికి ధర్మ సందేహం అడ్డు తగిలింది. కొన్ని రోజులు గడిచేప్పటికి ప్రకాశానికి, వర్కుషాపులో పని కుదిరింది. నెలకు ఎనభై రూపాయలు.

* *

కాలం గడుస్తూ వుంది. ప్రకాశానికి తండ్రి లేడు. తల్లికి తన కొడుకు సంగతి పట్టనే లేదు.

ఘనతవల్లనే అగ్రస్థానం



ప్రతి షాపులోను దొరుకును

ప్రకాశం ఫలానా ఊళ్లో వున్నాడని, ఎవతెనో ఉంచుకుని ఉద్యోగం చేస్తున్నాడని, సంసార పక్షంగా బ్రతుకుతున్నాడని అతని మేనమామ రంగయ్యకు తెలిసింది. ఆయన వెంటనే తన భార్యకు చెప్పాడు.

'వాడి ముఖం కాదూ? ఆ పోరంబోకు ముండాకొడుకు ఉద్యోగం చేస్తున్నాడంటే నువ్వెలా నమ్మేవూ?' అన్నది.

'అది కాదే మన పిల్ల దానికా, సంబంధాలు రావడం లేదు. ఏం, చూస్తే పోయే దేముందీ?'

'అదా మీయెత్తు! ఐతే చూసి రాండి నాకూతుర్ని మాత్రం, ఛస్తే వాడి కివ్వను' అని నిక్కచ్చిగా చెప్పేసింది రాజమ్మ.

## 3

వసారాలో వంట చేస్తున్న సావిత్రికి బయట ఎవరో పిలుస్తున్నట్టు వినిపించి గబగబా వాకిట్లోకొచ్చింది.

'ప్రకాశం ఉన్నాడా?' అన్నాడు వీధిలో నుంచున్న మనిషి.

'పనిలోకి వెళ్లారు' అన్నది సావిత్రి.

'ఎప్పుడొస్తాడు?'

'ఆయనతో మీకేం పని?'

'మాట్లాడే పనుంది.'

'మధ్యాహ్నం ఒంటిగంటకు వస్తారు' అన్నది సావిత్రి. అతను ఊళ్లో మనిషిలా కనిపించ లేదు. తన భర్త వచ్చేవరకూ ఆయన ఇక్కడే కూర్చునేలా వున్నాడు. సావిత్రి అయన్ను లోపల కూర్చోమన్నది. అతను మాట్లాడకుండా కూర్చున్నాడు.

టైం ప్రకారం ప్రకాశం ఇంటికి రావడంతోనే అంతవరకు ఇంట్లో కూర్చున్న ఆసామి అమాంతంగా లేచి 'ఒరే వెధవా! ఇన్నాళ్లనుంచీ ఒక ఉత్తరం ముక్కయినా రాయలేదేంరా? నీ బంగారం మాకు అంటుకు పోతుందనా?' అన్నాడు.

'ఎప్పుడొచ్చావు మామయ్యా?' అన్నాడు ప్రకాశం.

'చాలా సేపయింది నే నొచ్చి.'

'అంతా బాగున్నారా?'

'ఆఁ'

కొంచెం సేపు ఆయన వూరుకుని 'మీ అత్త నిన్నొకసారి తీసుకు రమ్మందిరా' అన్నాడు

'ఎందుకూ?'

'నాకు మాత్రం ఏం తెలుసు రారాదూ?'

ఇదంతా చూస్తూ సావిత్రి నిర్ఘాంతపోయింది. ఆ తరువాత ప్రకాశం మామ, తన గోడంతా ఏకరువు పెట్టాడు.

'ఒరే ప్రకాశం! పెళ్లీ పెడాకులూ లేకుండా ఇలా ఎంతకాలం ఉంటావురా? కాంతం పెద్దదయింది. ఇప్పుడు గాని దాన్ని నువు చూశావంటే వొదిలి పెట్టవు. నామాట విను.' ఈ మాటలు పూర్తి కాకముందే ఇక్కడ మాట్లాడితే గుట్టు బయట పడుతుందని, ప్రకాశం, తన మామగార్ని చెయ్యి పట్టుకుని బయటకు తీసు కెళ్ళాడు.

సావిత్రికి అంతా అర్థమయినట్టయింది. ఈ ప్రకాశం, తన మేనమామ కూతుర్ని పెళ్ళాడేలా ఉన్నాడు. ఏముంది నాలుగు మాటలు నూరి పోయంగానే బుర్ర తిరుగుతుంది! తన బతుకు నట్టేట గలసినట్టే! తుమ్మితే ఊడిపోయే చోటు నుంచి తను లేచిపోయి ఎన్నో నమ్మకాలతో ప్రకాశం వెంట వచ్చింది గాని, ఈ ముక్కు తుమ్మకముందే ఊడేలా వుంది.

ఇటువంటి మాటలే సావిత్రి మనసులో చాలా తిరిగినై! ఆవేళ సావిత్రి చాలా సేపు యేడుపు ముఖంతో ఆలోచించింది.

ప్రకాశం, తన మేనమామను ఆ రోజల్లా వుంచి, మర్నాడు పంపించేశాడు. సావిత్రికి అనుమానం మరింత బలపడింది. అడిగింది కూడాను!

'నన్ను నమ్మలేవా సావిత్రీ' అన్నాడు ప్రకాశం.

'ఇంతవరకూ అన్ని వస్తువా నమ్మక మ్మీదనే చేస్తూ వచ్చాను, కాని అను కున్నట్టుగా ఏదీ జరగ లేదు. జరుగుతుం దనే నమ్మకం ఏకోశానా లేదు' అన్నది సావిత్రి.

'నువ్వు నా దగ్గర ఉన్నంత కాలమూ నేను పెళ్లి చేసుకోను, సరేనా?' అన్నాడు ప్రకాశం ఖచ్చితంగా

'అవును గాని మీ మామగారు నీతో ఏమని చెప్పారు — నాకు చెప్పరా?'

'ఏం చెబుతాడు? తన కూతురు పెద్ద దయిందట! నేనాపిల్లను పెళ్లాడాలట! వీడో ప్రాణులాడేందుకు వచ్చాడు.'

'నువ్వేమన్నావూ?'

'ఏమంటానూ? చేసుకోనన్నాను!'

'నిజంగానా?'

'అబద్ధం కాదు.'

'భగవంతుడు సాక్షిగానా?'

'చెప్పాను కదా సావిత్రీ! ఆమాత్రం నన్ను నమ్మలేవా?'

ఎన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పినా సావిత్రి, తృప్తి చెందలేక పోయింది. ప్రకాశం, నమ్మించడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు పాపం!

భవిష్యత్తులో తన గాలిమేడలు కూలి పోతున్నట్టు, ప్రకాశం ఆ మర్నాడు ఊరు వెళ్లి రావడం సావిత్రికి మరింత మతి పోయినట్టయింది. ప్రచండోద్వేగానికి వట వృక్షం కదలిక లాడినట్టు ఆమె వొళ్లంతా ఒక్కసారిగా కంపించింది.

రాత్రి పది గంటలయినా సావిత్రి ఇంట్లో కనిపించక పోయేప్పటికి ప్రకాశానికి వెర్రెత్తింది. పిచ్చాడికి మల్లే ఊళ్లు అన్నీ తిరిగి, పన్నెండు గంటలకు ఇంటి కొచ్చినా సావిత్రి కనిపించ లేదు. అప్పటికి ప్రకాశం, 'లైలా మజ్నూ' లో 'ఖైస్' లా తయారయ్యాడు. సావిత్రి మంచమ్మీద, అతనికి ఒక చీటీ కనిపించింది. ఆత్రంగా చదవ సాగాడు.

'ప్రకాశం, నువ్వు నన్ను రక్షించ లేవు. ఎందుకంటే ఈ పరిస్థితిలో నిన్ను నేను నమ్మలేకుండా వున్నాను. నీ వివాహానికి నేనుండడం చాలా అడ్డుగా ఉన్నట్టు తోచింది. ఆ కారణం తోనే అడ్డు లేకుండా వెళ్లి పోతున్నాను. అన్నీ మర్చిపో! నన్ను వెతికేందుకు ప్రయత్నించి విఫలుడవు కావద్దు.

నీ ప్రేమను కోల్పోయిన, సావిత్రి.'

ప్రకాశానికి నవ నాడులు తెగిపోయి నయ్! తలను గోడకేసి కొట్టుకున్నాడు, లోకమంతా చీకటై పోయింది. ఇంకొక రెండుసార్లు గుద్దుకుంటే తల పగుల్తుంది. కాని, ఆయన నడుమును రెండు చేతుల తోనూ పట్టుకుని వెనక్కు లాగుతున్నట్టు తోచి తల తిప్పి చూసి, ఒక్కసారిగా ఉలిక్కిపడి 'నన్ను పరీక్షిస్తున్నావా సావిత్రీ!' అని తన రెండు చేతులతోనూ ప్రియురాలిని గాఢంగా ఆలింగనం చేసు కున్నాడు ప్రకాశం.

దుఃఖపూరితమైన ప్రకాశం ముఖంలో నుంచి రాలే ఆనంద బాష్పాలను తన పమిట చెంగుతో వొత్తుతూ, సావిత్రి, 'నకిలీ బంగారాలకు గీటు రాళ్లు లేకపోతే మోసపోరూ?' అంటూ దగ్గరకు తీసు కొన్నది.

★